సాక్షి రంగారెడ్డి

గురువారం । 29 । ఆగస్టు । 2024



రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధం

అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. 8లో▸



పశుపోషణలో జాగ్రత్తే రక్ష

సీజనల్ వ్యాధులపై రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉంటే సత్ఫలితాలుంటాయని డాక్టర్.భానునాయక్ సూచించారు. 8లో▸



31 నుంచి శిక్షణ తరగతులు

రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

మైసిగండి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మైసిగండి మైసమ్మ తల్లి పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

కడ్తాల్: మైసిగండి మైసమ్మ తల్లి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మైసిగండి మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, మైసిగండి మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జవహర్‌లాల్, మహేందర్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, వెంకటేశ్, యాదగిరిస్వామి, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ మహేశ్వరం డిపో మేనేజర్‌గా లక్ష్మీసుధ



మహేశ్వరం: ఆర్టీసీ మహేశ్వరం డిపో మేనేజర్‌గా బుధవారం లక్ష్మీసుధ బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో మహేశ్వరం డిపోకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన మోహన్‌రెడ్డి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ సంస్థ ప్రగతికి కృషి చేస్తానన్నారు. ప్రయాణికుల ఫిర్యాదులు, వినతులు స్వీకరించి అన్ని రూట్లలో బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దివ్యాంగుల పెన్షన్లు పెంచి ఇవ్వాలి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగుల పెన్షన్ పెంచి ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలో ఆ సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భగా జంగయ్య మాట్లాడుతూ రూ.200 ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను మంద కృష్ణ మాదిగ పోరాటానికి స్పందించి రూ.500 చేశారని గుర్తు చేశారు. అనంతరం టీఆర్ఎస్ పాలనలో రూ.3వేల వరకు పెంచారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రూ.6వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా స్పందన లేదని మండి పడ్డారు. దివ్యాంగుల పెన్షన్లు వెంటనే విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, కృష్ణ, వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు యాదయ్య, బాలరాజు, సంజీవ, సురేశ్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ అబ్బాయి.. అమెరికా అమ్మాయి

నాగోలు: హైదరాబాద్ అబ్బాయి.. అమెరికా అమ్మాయి పెళ్లి వేడుకలు బుధవారం నాగోలు స్వాగత్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో తెలుగు సంప్రదాయం ప్రకారం ఘనంగా జరిగాయి. నాగోలు లక్ష్మీనర్సింహ కాలనీకి చెందిన నారమళ్ల జీవన్ జ్యోతి- సుధాకర్‌రావు దంపతుల కుమారుడు రోహిత్ చదువు కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ ఉద్యోగం చేసే క్రమంలో అదే ప్రాంతంలో ఉపాధ్యాయురాలిగా పని చేసే రెబేకాతో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసి పరిణయానికి బాటలు వేసింది. రెబేకా తల్లిదండ్రులు లౌవురా-తియోతి అంగీకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం బుధవారం ఘనంగా వివాహం చేశారు.

ఓయూ పీజీ పరీక్షలు 19కి వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో జరగనున్న పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు వచ్చే నెల 19కి వాయిదా వేశారు. తొలుత ప్రకటించిన సెప్టెంబరు 4 నుంచి ప్రారంభం కావాల్సిన పీజీ కోర్సుల 2, 4వ సెమిస్టర్ పరీక్షలను యూజీసీ నెట్, టీఎస్ సెట్ పరీక్షల కారణంగా వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.



యాచారం: కుర్మిద్దలో సోమన్న గంపల ఊరేగింపు

బోనమెత్తిన పల్లెలు

శ్రావణమాసం సందర్భంగా పల్లెల్లో ప్రజలు మొక్కులు తీర్చుకుంటున్నారు. కుల దైవాలకు, గ్రామ దేవతలకు బోనాలు సమర్పిస్తున్నారు. బుధవారం జిల్లా పరిధిలో నిర్వహించిన ఉత్సవాల సందర్భంగా డిల్లెం బల్లెం చప్పుళ్లు , పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: మైసిగండిలో బోనాల ఊరేగింపు

పీఏసీఎస్ గోదాం రెడీ

- రూ.60లక్షల నాబార్డు నిధులతో నిర్మాణం
- రాయితీపై రైతులకు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



యాచారంలో నాబార్డు నిధులతో నిర్మించిన నూతన గోదాం

యాచారం: రైతులకు సేవలందించేందుకు పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) ప్రత్యేక గోదాం సిద్ధమైంది. రూ.60లక్షల నాబార్డు నిధులతో ఈ గిడ్డంగిని నిర్మించారు. గతంలో ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన భవనంలోనే పీఏసీఎస్ సేవలందించడంతో పాటుగా గోదాం సైతం అదే భవనంలో కొనసాగేది. ఇరుకైన భవనంలో ఇబ్బందులు తలెత్తడంతో 2017లో రూ.40లక్షల నాబార్డు నిధులు వెచ్చించి పీఏసీఎస్ భవనం నిర్మించి రైతులకు సేవలు అందిస్తున్నారు. పాత పీఏసీఎస్ భవనంలోనే రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేశారు. రైతుల భవిష్యత్ అవసరాల దృష్ట్యా నూతన గిడ్డంగి నిర్మించారు. త్వరలోనే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించేందుకు పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, సీఈఓ నాగరాజు పనులు చేపడుతునారు.

రూ.కోటి నిధులతో నిర్వహణ

యాచారం పీఏసీఎస్ పరిధిలో మండలంలోని 24గ్రామాల నుంచి ఐదు వేలకు పైగా సభ్యులున్నారు. 3,500 మంది పైగా రైతులు స్వల్పకాలిక, దీర్ఘకాలిక, బంగారం తాకట్టు పెట్టి రుణాలు పొందారు. మరో 250మందికి పైగా వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. గతంలో భవనం ఇరుకుగా ఉండడంతో ప్రతీ సంవత్సరం రూ.30లక్షల ఎరువులు, రూ.15లక్షల విత్తనాలు రైతులకు విక్రయించేవారు. నూతన గోదాం అందుబాటులోకి వస్తే రూ.కోటికిపైగా నిధులు వెచ్చించి ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

'సీఎస్‌సీ' ఏర్పాటుకు ఓకే

నూతనంగా ప్రారంభించిన గోదాం పై అంతస్తులో ఒక గదిలో సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్)ను ఏర్పాటు చేసేందుకు గాను పీఏసీఎస్ అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే డీసీసీబీ నుంచి అనుమతులు సైతం మంజూరయ్యాయి. ఈ సెంటర్ ప్రారంభంతో రైతులకు బ్యాంకింగ్, ట్రావెల్స్, ఇతర సేవలు అందించనున్నారు. పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్న రైతులంతా సీఎస్‌సీ సెంటర్‌లోనే అన్ని రకాల సేవలు పొందేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు తక్కువ ఫీజులతో అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారు. సీఎస్‌సీ సెంటర్‌లో సిబ్బంది నియామకానికి పీఏసీఎస్ నుంచి డీసీసీబీ ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

రాయితీలు ఎత్తేశారు



గతంలో వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు రాయితీపై అందజేసే వారు. అప్పట్లో వ్యవసాయం చేసే రైతులకు పెట్టుబడుల విషయంలో ఎంతో మేలు జరిగేది. గతంలోని బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ రాయితీలనే బంద్ చేసింది. రాయితీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందజేసే విధంగా పీఏసీఎస్ కృషి చేయాలి.

– కొలన్ మల్లారెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

ముందు చూపుతోనే..



రైతాంగ భవిష్యత్ అవసరాల దృష్ట్యా తన హయాంలోనే రూ.40 లక్షల నాబార్డు నిధులతో నూతనంగా పీఏసీఎస్ భవనాన్ని నిర్మించా. విశాలమైన స్థలంలో గోదాం నిర్మించే విధంగా అప్పుడే సంకల్పించాం. తన కృషి ప్రస్తుతం రైతాంగానికి ఉపయోగకరంగా మారింది. రైతులు పీఏసీఎస్‌లో అవసరమైన సేవలు పొందాలి.

– నాయిని సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



రూ.60 లక్షల నిధులతో నిర్మించిన గోదాం భవనం నిర్మాణం పూర్తి అయింది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యల చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం. రూ.కోటి నిధులతో నూతన గోదాంలో ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు సిద్ధంగా ఉంచేలా కృషి చేస్తున్నాం.

– నాగరాజు, సీఈఓ యాచారం పీఏసీఎస్

సంబురంగా ఉట్ల పండుగ

చిలుకూరులో బాలాజీ ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు

మొయినాబాద్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని చిలుకూరు బాలాజీ ఆలయంలో బుధవారం ఉట్ల పండుగ నిర్వహించారు. మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద ప్రతీ సంవత్సరం కృష్ణాష్టమి తరువాత రోజు ఉట్ల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామివారిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం ఎదుట ఉట్లు కొట్టారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ కృష్ణాష్టమి, ఉట్ల పండుగ విశిష్టతను భక్తులకు వివరించారు. వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద స్వామివారి ఊరేగింపు

ఆ భవనాల లెక్క తేల్చండి

- బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలపై నివేదిక సమర్పించండి
- గొలుసు కట్టు చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్



ఎస్‌వైఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద ఎఫ్‌టీఎల్ హద్దు రాయిని పరిశీలిస్తున్న రంగనాథ్

మీర్‌పేట: బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ భవనాల లెక్క తేల్చాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ మీర్‌పేట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం.. కార్పొరేషన్ పరిధిలోని మూడు గొలుసుకట్టు చెరువులను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణాలపై ఆరా తీశారు. గతంలో కబ్జా చేసిన ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారా..? అని అడిగారు. చందన చెరువుకు ఆనుకుని నిర్మించిన ఎస్‌వైఆర్ ఫంక్షన్‌హాల్ వద్ద ఉన్న ఎఫ్‌టీఎల్ హద్దు రాయిని పరిశీలించారు. ఫంక్షన్‌హాల్ అనుమతి పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. పూర్తి వివరాలతో రూపొందించిన నివేదికను సోమవారం లేదా మంగళవారం హైడ్రా కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణదారుల వద్ద ఉన్న పత్రాలు, మన వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుందామని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, మీర్‌పేట కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



షాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే కారును చుట్టుముట్టిన కాంగ్రెస్ నాయకులు

సప్తముఖ మహాశక్తి గణపతికి పెయింటింగ్ షురూ

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తులో రూపుదిద్దుకుంటున్న శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి తయారీ పనుల్లో భాగంగా బుధవారం రంగులు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పూర్తిగా మట్టితో రూపుదిద్దుకుంటున్న మహాగణపతి ఫినిషింగ్ పనులు పూర్తి కావడంతో వాటర్ పెయింటింగ్ పనులను ప్రారంభించారు. బుధవారం సెంట్రల్ జోన్, ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మహ్మద్ మాజిద్, సైఫాబాద్ ఏసీపీ ఏసీపీ ఎర్న, ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌లతో కలిసి మహాగణపతి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులతో చర్చించారు. వినాయకచవితి లోపు రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేసి ఎవ్వరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని దానం నాగేందర్ తెలిపారు.

ఎమ్మెల్యేకు చేదు అనుభవం

- కాలె యాదయ్య కారుపై కోడిగుడ్లు, టమాటాలు, వాటర్ బాటిళ్లతో దాడి
- గంటకు పైగా కారులోనే కూర్చున్న కాలె
- తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కాంగ్రెస్ శ్రేణుల మండిపాటు



నాయకులను నచ్చచెబుతున్న పోలీసులు

షాబాద్: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చేదు అనుభవం ఎదురైంది. షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఆయన వాహనంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోడిగుడ్లు, టమాటాలు, వాటర్‌బాటిళ్లతో దాడి చేశారు. ఎమ్మెల్యే డౌన్‌డౌన్, యాదయ్య గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వాహనానికి అడ్డంగా కూర్చుని ధర్నా నిర్వహించారు. అధికారం లేకపోయినా పదేళ్లుగా పార్టీలో ఉంటూ కష్టపడిన తమకు ప్రాధాన్యం దక్కడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులను వెంటేసుకుని తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశానికి ఎమ్మెల్యే వస్తున్నాడని ముందుగానే తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు ముందస్తు ప్లాన్ ప్రకారం దాడికి పాల్పడ్డారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మండలంలోని కాంగ్రెస్‌కు చెందిన ఓ వర్గాన్ని దూరం పెట్టారని ఆరోపించారు. తమ బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. తాము ఎమ్మెల్యేకు వ్యతిరేకం కాదని, పార్టీ శ్రేణుల పట్ల ఆయన అనుసరిస్తున్న విధానాలకు మాత్రమే వ్యతిరేకమని నినాదాలు చేశారు. ఇదే సమయంలో అక్కడకు వచ్చిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌పై పలువురు కార్యకర్తలు దాడికి దిగారు. దీంతో పోలీసులు ఆయన్ను అక్కడి నుంచి పంపించారు. ఎట్టకేలకు సీఐ కాంతారెడ్డి, సీనియర్ నాయకుడు తమ్మలి రవీందర్ కల్పించుకుని ఎమ్మెల్యేతో మాట్లాడిస్తామని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య కార్యాలయంలోకి వెళ్లిన యాదయ్య లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఓడిపోయిన భీంభరత్ మద్దతుదారులను.. పార్టీలో చేరిన ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే దాడి జరిగినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనలో 25 మంది కాంగ్రెస్ శ్రేణులతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ కాంతారావు తెలిపారు.


ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణం

చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేస్తూ ఓ వైపు హైడ్రా హడలెత్తిస్తున్నా అక్రమ నిర్మాణాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. ఎఫ్‌టీఎల్‌లోనే యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అడ్డుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు. దీంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

- చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు
- చిలుకూరు అంతప్ప చెరువులో షెడ్డు నిర్మించిన అక్రమార్కులు



చిలుకూరు అంతప్ప చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన షెడ్డు



చిలుకూరు అంతప్ప చెరువు మ్యాప్

మొయినాబాద్: మండల పరిధి చిలుకూరు రెవెన్యూలో 33 ఎకరాల్లో అంతప్ప(నల్ల చెరువు) చెరువు ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేవలం నెల రోజుల్లో ఓ షెడ్డు నిర్మాణం పూర్తి చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దనే నిబంధనలున్నా అక్రమార్కులు తుంగలో తొక్కుతున్నారు.

పరిశీలించి.. పట్టించుకోని అధికారులు

చిలుకూరు అంతప్ప చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణం జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఎఫ్‌టీఎల్‌లో పనులు మొదలైన సమయంలోనే సదరు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు అడ్డుకోకపోవడంతో నెల రోజుల్లోనే షెడ్డు పూర్తయింది. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం వల్లే అక్రమ కట్టడం వెలిసిందని ఆదిలోనే అడ్డుకుంటే నిర్మాణం జరిగేది కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రెవెన్యూ అధికారులకు లేఖ

చిలుకూరు అంతప్ప చెరువులో నిర్మిస్తున్న షెడ్డు ఎఫ్‌టీఎల్ పరిధిలోకే వస్తుంది. మొదట్లోనే సర్వే చేసి ఎఫ్‌టీఎల్‌లో నిర్మించొద్దని చెప్పాం. అయినా వినలేదు. దీనిపై రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. రెవెన్యూ అధికారులతో కలిసి త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మి, ఇరిగేషన్ ఏఈ, మొయినాబాద్

రుణమాఫీ చేసేందుకు సిద్ధం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రూ.2 లక్షల్లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, బ్యాంకు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ అమలులో లబ్ధిదారులకు సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలు, రుణాల రెన్యువల్ తేదీల్లో తప్పులు దొర్లినట్లయితే సంబంధిత ఖాతాలను అధికారులు వెంటనే సరిచేసి ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. అదేవిధంగా బ్యాంకు అధికారులు రైతుల రుణాలకు సంబంధించిన జాబితాను తయారు చేయాలని సూచించారు. మాఫీ కాని రైతులను గుర్తించి వెంటనే రుణమాఫీ అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే వాటిని పరిష్కరించేందుకు వ్యవసాయ, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి రైతు భరోసా పేర ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ యాప్‌లో అధికారులు అన్ని వివరాలను నమోదు చేస్తే ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి రుణమాఫీ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఏ రాజారత్నం, ఏఓ నిషాంత్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి మృతి



మృతుడు ప్రమోద్

కేశంపేట: జీవితంపై విరక్తి చెంది యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ గ్రామంలో గంజాయి జంగయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఇతడికి కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ప్రమోద్(30) 6 సంవత్సరాల క్రితం మహేశ్వరం గ్రామానికి చెందిన కృపను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారి జీవనం మూడు సంవత్సరాలు సాఫీగా సాగిన తరువాత గొడవలు మొదలయ్యాయి. ఈ గొడవలు భరించలేక నాలుగు నెలల క్రితం కృప తల్లి గారింటికి వెళ్లింది. దీంతో ప్రతిరోజు భార్యతో ఫోన్‌లో గొడవ పడేవాడని గ్రామస్తులు తెలిపారు. రోజు మాదిరిగా మంగళవారం రాత్రి కూడా భార్య భర్తలు ఫోన్‌లో గొడవ పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గొడవ అనంతరం మృతుడు ఇంటి పక్కన గుడిసెలో నిద్రించినట్టు, ఉదయం నిద్రలేవకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూశారు. అప్పటికే ప్రమోద్ గుడిసెలో పైకప్పుకు ఉరి వేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



జనార్దన్ (ఫైల్)

కేశంపేట: విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంతపూర్ గ్రామానికి చెందిన బిజారం జనార్దన్ (40) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. జనార్దన్ మంగళవారం కొత్తపేట గ్రామానికి చెందిన గొల్లపల్లి చెన్నయ్యతో కలిసి పాటిగడ్డ గ్రామ శివారులో విద్యుత్ పనులు చేసేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ స్తంభానికి వైర్లు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన జనార్దన్‌ను 108లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని సాయికృష్ణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పశుపోషణలో జాగ్రత్తే రక్ష

- సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం
- సకాలంలో స్పందిస్తే వ్యాధుల నివారణ సులభం
- పశువైద్యాధికారి, భానునాయక్



కడ్తాల్: వర్షాకాలంలో పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు, పశుపోషకులు అప్రమత్తంగా ఉండి, సరైన సమయంలో స్పందిస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలు ఉంటాయని వెటర్నరీ అధికారి భానునాయక్ సూచించారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను చేపట్టినవారు అధిక పాల ఉత్పత్తి కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన పచ్చిగడ్డితో పాటు దాణా, మినరల్ మిక్చర్‌ను అందిస్తే ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరుతుందని భానునాయక్ సూచించారు.

ప్రశ్న: పశువులకు వచ్చే వ్యాధుల పట్ల, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: పాడి పశువులకు, వచ్చే వ్యాధుల పట్ల రైతులు తగు జాగ్రత్త వహించాలి. జబ్బవాపు, గాలికుంటు, గొంతు వాపు, పొదుగువాపు వ్యాధులు వచ్చే అవకాశాలుంటాయి. ప్రధానంగా పాడిపశువు సంకభాగంలో, పొదుగు వద్ద సోకుతుందని, దీంతో పాలు పితకడానికి ఇబ్బందులు కలుగుతాయి.

రైతులు వెంటనే రోగాన్ని గుర్తించి పశువైద్యుడిని సంప్రదించి, టీకాలు వేయించాలని సూచించారు. కాళ్ల పగులు జలుబు, నోటిగుండా జొల్లు కారడం, జ్వరం, కుంటుతూ నడవడం, మేతమేయక పోవడం లాంటి లక్షణాలు ఉంటే, గాలికుంటు వ్యాధి లక్షణాలుగా గుర్తించి, వైద్యుడిని సంప్రదించి ముందస్తుగా చికిత్స చేయించాలి.

ప్రశ్న: పశువులలో పాలజ్వరం ఎందుకు వస్తుంది, నివారణకు తీసుకోవలసిన చర్యలేవి?

జవాబు: పాడిపశువులు ఈనిన కొత్తలో పాలజ్వరం వస్తుంది. శరీరంలో కాల్షియం నిల్వలు తగ్గినప్పుడు దీని బారిన పడతాయి. వాటి లక్షణాలు శరీరం చల్లబడి పాడిపశువులు తలను డొక్కలో పెట్టుకుని, చలనం లేకుండా కదిలించిన కదులకుండా ఉంటాయి. కాల్షియం బోరోగ్లూకోనేట్, ద్రవం తగిన మోతాదులో పశువు రక్తంలో ఎక్కించాలి.

ప్రశ్న: పాడిపశువులకు గోమారి, పేను, పిడుదులు పట్టకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచాలి. తరచూ ఫినాయిల్‌తో పాకను శుభ్రం చేయాలి. పరిశుభ్రంగా లేకపోతే సూక్ష్మజీవులు పాడిపశువుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. గోమారిపేను సోకకుండా, పశువుల మూతికి బుట్టకట్టి, పశువుల పాకలో బూటాక్స్‌లేదా, అమిత్రాజ్ చల్లాలి. అదేవిధంగా పశువుల శరీరంపై చల్లి కాసేపు ఎండలో ఉంచాలి. అనంతరం అరగంట తర్వాత శుభ్రమైన నీటితో పశువులను కడగాలి.

ప్రశ్న: పశువుల షెడ్డులో తరచూ ఇబ్బంది పెట్టే దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

జవాబు: సాధరణంగా రైతులు తమ వ్యవసాయపొలాల్లో లభించే, అయిల్‌ఆకులతో రోజు పొగపెట్టాలి. షెడ్డులో తడిగా ఉండకుండా పేడ, మూత్రం లేకుండా చూడాలి.

ప్రశ్న: పశువులకు మినరల్ మిక్చర్ ఎంతవేయాలి. ఎప్పుడు వేయాలి?

జవాబు: పశువులకు పెట్టే దాణలో గాని, కుడితిలో గాని మినరల్ మిక్చర్ ప్రతి రోజు 40నుంచి, 50 గ్రాములు తినిపించాలి. మినరల్ మిక్చర్‌లో కాల్షియం, పాస్ఫరస్, ఐడిన్, మెగ్నిషీయం, కోబాల్ట్, కాఫర్, మాంగనీస్ వంటి లవణాలుంటాయి. పశువుకు దీన్ని అందించడం ద్వారా పశువులకు ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు, అధికంగా పాలు ఇస్తాయి.

ప్రశ్న: బీరు కల్లి పశువులకు పెట్టడం ఉపయోగకరమేనా?

జవాబు: బీరు కల్లి ఉపయోగించడం ద్వారా పశువులకు భవిష్యత్తులో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. రైతులు సాధ్యమైనంత వరకు పశువులకు పచ్చిగడ్డి, ఎండుగడ్డితో పాటు సమీకృత దాణతో పాటు, మినరల్ మిక్చర్ అందించాలి.

ప్రశ్న: పశువులకు వ్యాధులు రాకుండా మీరిచ్చే సలహా ఏంటి?

జవాబు: పశువుల పాక శుభ్రంగా ఉంచడంతో పాటు, దాణ, నీరు, కలుషితం కాకుండా చూడాలి. పరిశుభ్రమైన నీరు తాగించాలి. తడిసిన కుళ్లిన గడ్డిని తినిపించరాదు. నాణ్యతతో కూడిన పచ్చి గడ్డి, చొప్ప పశుగ్రాసంగా వేస్తే అధిక లాభాలు సాధించవచ్చు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

- 31 నుంచి రైతుసంఘం రాజకీయ శిక్షణ
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్



మాట్లాడుతున్న సాగర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ నెల 31నుంచి సెప్టెంబర్ 1, 2తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.సాగర్ పిలుపునిచ్చారు. బుధవారం రాగన్నగూడ సమీపంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతపల్లిగూడ గేటు సమీపంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణ, వ్యవసాయ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొస్తున్న మార్పులు, రైతులు, రైతు సంఘం కార్యకర్తలు తీసుకోవాల్సిన చర్యలను ఈ తరగతుల్లో చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కాడిగళ్ల భాస్కర్, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, పంది జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

మహేశ్వరం: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన నాయకుల త్యాగం మరువలేనిదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో 20 ఏళ్ల క్రితం విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ఉద్యమించగా అప్పటి ప్రభుత్వం పోలీసులతో భాష్పవాయువు ప్రయోగించి, గుర్రాలతో తొక్కించి, కాల్పులు జరిపిందన్నారు. ఈ ఉద్యమంలో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి నేలకొరిగారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. దేశంలో మహిళలపైన హత్యలు, లైంగిక దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్, సీఐటీయూ నాయకులు కవిత, కిషన్, స్వప్న, శేఖర్, పెంటయ్య, నర్సింహ, బుగ్గ రాములు, ప్రవీణ్, వీరయ్య, శేఖర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికి గుర్తింపు



నియామకపత్రం అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులుగా రావులకోళ్ల నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంద రవీందర్‌రెడ్డిలను నియమించారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ యువనాయకుడు కార్తీక్‌రెడ్డితో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కలిసి ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ కోసం ప్రజల కోసం నిరంతరం పని చేస్తూ కార్పొరేషన్‌లో పార్టీని మరింత అభివృద్ధి చేయాలని, ప్రజల వెంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కష్టపడి పని చేసే వారిని బీఆర్ఎస్ గుర్తించి వారికి పదవులు అప్పగిస్తుందన్నారు.

విద్యార్థి అదృశ్యం



సాత్విక్‌రెడ్డి (ఫైల్)

శంకర్‌పల్లి: విద్యార్థి అదృశ్యమైన సంఘటన బుధవారం శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం గ్రామానికి చెందిన జి సాత్విక్‌రెడ్డి (14) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏనిమిదోతరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అందరితో కలిసి భోజనం చేసిన తర్వాత నిద్రించిన అతను ఉదయం 4.30గంటలకు స్కూల్ డ్రెస్ వేసుకొని, బ్యాగులో రెండు జతల బట్టలు, కొంత నగదు తీసుకొని బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు ఇంటి చుట్టుప్రక్కల, బయట సీసీ కెమెరాలో వెతికారు. 5.15కి శంకర్‌పల్లిలో పటాన్‌చెరు బస్సు ఎక్కినట్లు తెలుసుకున్నారు. పటాన్‌చెరులోని ఓ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేసే వరకు సీసీ కెమెరాల దృశ్యాలు లభించాయి. తర్వాత ఎటు వైపు వెళ్లిన విషయం తెలియలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆధారంగా సర్వే

- అర్హులైన రైతులందరికీ రుణమాఫీ
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



సెల్ఫీ తీసుకుంటున్న రవినాథ్

యాచారం: దరఖాస్తుల ఆధారంగా రుణమాఫీ కోసం ఇంటింటి సర్వే చేస్తామని.. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. బుధవారం యాచారంలో వ్యవసాయాధికారులు కుటుంబ నిర్ధారణ సర్వే చేపట్టారు. ఈ సర్వే పరిశీలనకు డీఏఓ నర్సింహారావు హాజరై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు లేకపోవడం, ఆధార్ కార్డు, పట్టాపాస్ పుస్తకాల్లో రైతుల పేర్లు సరిపోలక పోవడం తదితర కారణాల వల్ల రుణమాఫీ అవ్వలేదన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే ఇంటింటి సర్వే చేసి కుటుంబ నిర్ధారణ చేస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి రవినాథ్ ఆధ్వర్యంలో ఆరుగురు రైతుల ఇంటికి వెళ్లి కుటుంబ నిర్ధారణ సర్వే చేసి రైతుల కుటుంబ సభ్యుల సెల్ఫీ ఫోటోలను ప్రభుత్వం తయారు చేయించిన యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

గొర్లమందను ఢీకొన్న డీసీఎం

ప్రమాదంలో కాపరితో పాటు 8జీవాలు మృత్యువాత



గాయపడిన అంజనేయులును ఆస్పత్రికి తరలిస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో గొర్ల కాపరి ఆంజనేయులుతో పాటు 8 జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు సమీపంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం హన్మాన్‌పల్లి గ్రామానికి చెందిన గొర్ల కాపరి ఆంజనేయులు తన గొర్ల మందతో కోనాపూర్ నుంచి ఆమనగల్లు వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడగా.. గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. అదే సమయంలో నాగర్‌కర్నూల్ నుంచి నగరానికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. కాపరిని చికిత్స నిమిత్తం ఆటోలో ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వెంకటేశ్ పరిశీలించి, వివరాలు సేకరించారు. ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొబైల్ వైద్యం అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆమనగల్లు, కడ్తాల, కల్వకుర్తి పట్టణాలలో మొబైల్ వైద్య సదుపాయం అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సూచించారు. ప్రతి ఆస్పత్రి వద్ద అంబులెన్స్ సౌకర్యం ఉంచాలన్నారు. బుధవారం ఆయన ఆమనగల్లులో మాట్లాడుతూ.. మండలంలోని కోనాపూర్ గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి ఆంజనేయులు మృతి చెందడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును ఆమనగల్లు ఆస్పత్రికి తరలించడానికి 108కి ఫోన్ చేసినప్పటికీ అంబులెన్స్ రాలేదన్నారు. అటుగా వెళుతున్న తాను స్థానికుల సాయంతో ఆంజనేయులును ఆమనగల్లుకు తీసుకువచ్చినప్పటికీ కాపాడలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అంబులెన్స్ వచ్చి ఉంటే ఆయన బతికేవాడన్నారు. రహదారిని విస్తరించి, డివైడర్ ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వాస్పత్రి భవనాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి రోగులకు వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పత్యానాయక్, కుమార్, రమేశ్, వెంకట్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు చేయండి

తుర్కయంజాల్: మాసబ్ చెరువులో గణనాథుల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్‌మల్‌రెడ్డి అనురాధ అన్నారు. బుధవారం ఆమె అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. గడిచిన ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో విగ్రహాలు తరలి వచ్చే అవకాశం ఉందని, అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందులో కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కౌన్సిలర్లు ఉదయశ్రీ, రవీందర్ రెడ్డి, ఏతులు బిక్షపతి, చంద్రశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఈఈ హరీశ్ ఉన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: బంధువుల పెళ్లికి వెళ్లి వస్తూండగా ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి షాద్‌నగర్ పరిధిలో ఎలికట్ట చౌరస్తాలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్(40), సునీత దంపతులు. భార్యభర్తలు ఇద్దరు ద్విచక్రవాహనంపై షాబాద్ మండలం హైతాబాద్‌లోని వెంకటపూర్‌లో బంధువుల పెళ్లికి వెళ్లారు. సాయంత్రం తిరుప్రయాణంలో స్వగ్రామానికి వెలుతుండగా మార్గ మధ్యలో ఎలికట్ట గ్రామ శివారులోని చౌరస్తాలో రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్‌ను ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భర్త మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సునీతకు తీవ్రంగా గాయలవ్వడంతో షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

కూతురు కాపురంపై బెంగ

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కుమార్తె కాపురంపై బెంగ పెట్టుకొని ఓ తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద సంఘటన బుధవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన సిద్దిపేట ప్రభాకర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన రెండో కూతురు విడాకులు తీసుకుని కొంత కాలంగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈమె కొడుకు ఎవరి వద్ద ఉండాలనే విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. దీంతో మనవడు దూరమవుతాడేమో అని ప్రభాకర్‌రెడ్డి(60) మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చి, అంజిరెడ్డి వెంచర్‌లోని కంటైనర్‌కు ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అండాలు జిల్లెలగూడలో బీజేపీ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. బిడ్డ కాపురంపై మనోవేదనకు గురి కావడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు అండాలు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు వద్ద బాధిత రైతు

కొందుర్గు: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆగిర్యాలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కూర బాలకిష్టయ్య తన ఆవును మంగళవారం సాయంత్రం వరకు మేతమేయించి ఎప్పటిలాగే పొలం వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ విద్యుత్ స్తంభం విరిగిపడి ఉండడాన్ని గమనించారు. ఈ ఘటనలో ఆవు కరెంట్ తీగలకు తాకి మృతిచెంది ఉంది. ఆవు విలువ రూ.80వేల వరకు ఉంటుందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.